

# పరలోకములో 8 గంటలు

## రికార్డో సిద్ చెప్పినది

ప్రభువు అంటున్నాడు, “*నేను పరలోకమందు ఆసీనుడుగా ఉన్న ందున ఈ సందేశమును భూమిమీదనున్న నా ప్రజల కొరకు పంపుతున్నా ను.*”

ప్రకటన 4:1

ఈ సంగతులు జరిగిన తరువాత నేను చూడగా, అదిగో పరలోకమందు ఒక తలుపు తెరువబడియుండెను. మరియు నేను మొదట వినిన స్వరము బూరధ్వనివలె నాతో మాటలాడగా వింటిని. ఆ మాటలాడినవాడు - ఇక్కడికి ఎక్కిరమ్ము; ఇకమీదట జరుగవలసినవాటిని నీకు కనుపరచెదననెను.

ప్రకటన 5:11

మరియు నేను చూడగా సింహాసనమును, జీవులను, పెద్దలను ఆవరించియున్న అనేక దూతల స్వరము వినబడెను, వారి లెక్క కోట్లకొలదిగా ఉండెను. వారు - వధింపబడిన గొఱ్ఱెపిల్ల, శక్తియు ఐశ్వర్యమును జ్ఞానమును బలమును ఘనతయు మహిమయు స్తోత్రమును పొంద నర్హుడని గొప్ప స్వరముతో చెప్పుచుండిరి.

సంఘములోని అందరూ నా జీవితానికి సంభవించినది దయచేసి వినండి.

ఒక కలలో దేవుడు నాతో మాట్లాడడము మొదలుపెట్టాడు. నాకు బాగా గుర్తుంది - ఆ కలలో - మా ఇంటి నుండి బయటకు వెళ్ళి చుట్టుపట్ల వీధులలో నడుస్తుండగా ఎవరో తన చేతులతో ఆకాశానికి నన్ను కొనిపోతున్నట్లు ఒక అనుభూతి కలిగింది. చూస్తుండగానే మేఘాలలోబడి పైపైకి వెళుతూ దేవుణ్ణి స్తుతిస్తున్నాను నేను. అప్పుడు ఒక గొప్ప వెలుగు నా మీద ప్రకాశించింది. ఆ వెలుగులో నుండి ఒక కంఠస్వరము నాకు వినబడింది, "రికార్డో ..... రికార్డో ..... నువ్వు చేస్తున్న ఉద్యోగాన్ని వదిలిపెట్టు, నీ జీవితం ద్వారా నా సంఘమునందు నేను చేయవలసిన పని ఉన్నది."

ఈ మాటలు విన్నవెంటనే భయముతో వణకుతో నా కలనుండి మేల్కొన్నాను. ఏడుస్తూ దేవున్నడిగాను - *"ఏమిటి ప్రభువా ఇది?"*

నేను విన్న ఆ మాటలు నాలో అలాగే నిలిచిపోయాయి. ఇలా అనేక రోజుల పాటు జరిగింది. నేను మరలా పడుకుని ఇంకోసారీ అదే కలగన్నాను. ఈ కలలో కూడా ప్రభువుయొక్క అవే మాటలను మరలా విన్నాను. ఇలా అనేక సార్లు జరుగగా, నేను భయంతో అరుస్తూ మేల్కొనేవాడిని. ఎందుకంటే దేవుడు కలలో నాతో మాట్లాడే ప్రతిసారీ ఆయన స్వరము ఇంకా ఇంకా గట్టిగా వినబడసాగింది. నేను భయంతో మేల్కొన్నప్పుడెల్లా నా తల్లిదండ్రులు ఏమైందని అడిగేవారు. అప్పుడు నా కలల గురించి వాళ్ళకు చెప్పగా నా తల్లి నా కొరకు ప్రార్థించి *"ప్రభువు నీతో మాట్లాడుతుంటే కలను అర్థము చేసుకోవడానికి ఖచ్చితంగా ఆయన సహాయం చేస్తాడని చెప్పింది."* ఆ మరుసటి ఉదయం వరకు ఆ రాత్రంతా మేము ప్రార్థించాము. ఉదయము అమ్మ నా ఉద్యోగానికి నన్ను బయలుదేరమని చెప్పింది. అప్పుడు మేము ప్రభువు దగ్గర ఆయనే నాతో మాట్లాడుతున్నాడనడానికి ఒక సూచననడిగాము. తరువాత నేను స్నానం చేసి సిద్ధపడి ఉద్యోగానికెళ్ళాను. నేను "చిలి లేబొరేటరీస్" లో పని చేసేవాడిని.

నా పనంటే నాకు చాలా ఇష్టంగా ఉండేది. బస్ స్టేషన్ నుండి నేను నేరుగా పనికి తీసుకెళ్ళబడేవాడిని. నేను బస్ దిగగానే ఎవరో నాతో అన్నారు- *"నువ్విక్కడేం చేస్తున్నావ్? నువ్వు ఇంకా ఇక్కడ ఉండవలసిన వాడివి కాదే?"*

ఇంకా అనేక సంధర్భాలలో, చాలా మంది నాతో ఇదే మాట అన్నారు. ఆశ్చర్యమేమిటంటే వాళ్ళెవరూ కూడా క్రైస్తవులు కారు. ఇదే నాకు దేవుడిచ్చిన సూచన. ఈ సూచన తరువాత నా ఉద్యోగాన్ని వదిలివేయాలని నా పై అధికారి దగ్గరకు వెళ్ళి ఇదే మాటను ఆయనతో చెప్పాను. నేనన్నాను, *"నేను కంపెనీని విడిచిపెట్టాలనుకుంటున్నాను, ఎందుకంటే దేవుడు నన్నిలా ఆదేశించాడు."* ప్రభువు ఆదేశించినప్పుడు మనము ఆయనకు లోబడాలి. నా అధికారి నా నిమిత్తము కలతచెంది, "ఇటు తరువాత నువ్వు ఏమి చేయబోతున్నావు? ఇంతకంటే మంచి ఉద్యోగం నీకెక్కడ దొరకగలదు?" అని నన్నడిగినప్పుడు నేను దేవునికి లోబడి తీరాలని చెప్పాను. కాబట్టి నా నిమిత్తము వారు వీడ్కోల సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు రెండు వేల మంది విచ్చేశారు. తరువాత, నా వస్తువులన్నీ తీసుకుని ఇంటికి తిరిగివెళ్ళాను. నేను ఏడుస్తూ ఇల్లు చేరేటప్పటికి ఇంటి ముందర అమ్మ నా కోసం వేచివుంది. ఇతరుల ద్వారా నా కలలకు సంబంధించిన సూచనను ప్రభువు నాకిచ్చినందువల్ల నా ఉద్యోగాన్ని విడిచిపెట్టానని ఆమెతో చెప్పాను. ఆమె అన్నది, *"ప్రభువు నీతో మాట్లాడినట్లయితే నీ జీవితం పట్ల ఆయన తన చిత్తాన్ని జరిగించనీ."*




మేము ఇంట్లోనికి వెళ్ళి ఈ విషయమై చాలా సేపు చర్చించాము. నాకు నిద్ర వచ్చినప్పుడు - నేను పడుకోవాలని, ఈ రాత్రి దేవుడు కలలో నాతో మాట్లాడుతాడని ఆమెతో చెప్పాను. కలలో ఆయన నాతో మాట్లాడుతాడనుకున్నాను గాని, నేననుకున్నట్లు జరుగలేదు. కానీ, ఆయన నాతో ప్రత్యేకమైన పద్ధతిలో మాట్లాడాలని నిశ్చయించాడు. నేను పడుకుందామని గదిలోనికి వెళ్ళగా ఒక్కసారిగా గదంతా కంపించింది. నేను అరవడం ప్రారంభించాను, *"స్యాన్టియాగో నగరాన్ని, చిలీ దేశాన్ని భూకంపం తాకింది."* నేను నా గదిలోనుండి బయటకు వెళ్ళడానికి ప్రయత్నించాను గాని, ఎవరో ఒక అదృశ్య వ్యక్తి నన్ను తలుపుద్వారా బయటకు వెళ్ళకుండా అడ్డగిస్తున్నాడు. నా గదిలోనుండి అమ్మను, కుటుంబాన్ని చూడగలుగుతున్నాను గాని, నేను సహాయం కోసం ఎంత అరిచినా ఎవ్వరికీ వినబడడంలేదు. ఇక నాకు అర్థమయింది- ఈ అదృశ్య వ్యక్తి దేవుని దూతేనని. వెనుకకు వెళ్ళి నా మంచము పైన పడుకుని దేవుని చూచి బిగ్గరగా ఏడ్చి, ఏమి జరుగుతోందో నాకు చెప్పాలని ఆయనను వేడుకున్నాను.

అప్పుడు స్పష్టమైన ఒక స్వరము నాతో మాట్లాడగా పరిశుద్ధాత్మని ఆ మధుర స్వరము నాతో ఇలా అన్నది, “రికార్డో ..... నీ ఉద్యోగాన్ని నీవు విడిచిపెట్టావు కాబట్టి, సంఘ కూడికకు వెళ్ళి నీ కొరకు, ఈ భూమియందున్న నా సంఘము కొరకు ప్రతిరోజు ఏడు గంటలు ప్రార్థించు.” ప్రభువు మాట్లాడి ముగించినప్పుడు నా గది కంపించడం ఆగింది. అప్పుడు తలుపు ద్వారా బయటకు వెళ్ళడానికి ప్రయత్నించగా వెళ్ళగలిగాను. వెంటనే నా తల్లి దగ్గరకు పరుగెత్తి వెళ్ళి చెప్పాను, *“నేను పరిశుద్ధాత్మ స్వరము విన్నాను.”* ఇది చెప్పి ఇంటి నుండి బయటకు వెళ్ళి బయట కూడా ఈ మాటలను గట్టిగా అరిచి చెప్పసాగాను. దేవుడు మనుష్యులతో ఈ రోజుల్లో సయితము మాట్లాడుతాడని చెబితే కొంతమంది నమ్మరు. కానీ నేను చెబుతున్నాను ఇది సత్యం. ఆయన మనుష్యులతో మాట్లాడుతాడు. ఆయన అబ్రాహాముతో మాట్లాడగలిగినప్పుడు, ఆయన మనతో సయితము మాట్లాడగలడు! మనమాయన సంఘము. నేను ఆలయమునకు వెళ్ళి సంఘ పెద్దతో మాట్లాడాను. నేను ప్రార్థించి దేవుని ఆజ్ఞను అనుసరించగలుగుటకు ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటలకే ఆలయపు తలుపులు తెరవాలని మేము నిర్ణయించాము. ప్రతిరోజు ఉదయం ఆలయానికి వెళ్ళి ప్రార్థించేవాడిని. ఒక గంట, రెండు గంటలు ప్రార్థించిన తరువాత మూడవ గంట ప్రార్థించడానికి నా దగ్గర విషయమేమీ మిగిలేది కాదు. అప్పుడు దేవుణ్ణి అడిగేవాడిని, *“ప్రభువా, నేనింక ఏమని ప్రార్థించగలను? ఇంకా నాలుగు గంటలు మిగిలే ఉన్నాయే!”*

అప్పుడు భూమి లోపలినుండి భూ కంపర శబ్దము ఆలయపు వెనుక ద్వారము దగ్గర ప్రారంభమవడము విన్నాను. అప్పుడు ఆలయము మత్తుడైన వ్యక్తివలె కుడికి ఎడుమకు ఊగడము ప్రారంభించింది. ఈ స్థితిలో దేవుడు నాతో మాట్లాడిన స్వరము విన్నాను గాని, ఈ స్వరము నా కలలో విన్న స్వరమువలె లేదు. నాతో మునుపు కలలో మాట్లాడిన స్వరములో అధికారము ప్రతిధ్వనించింది కాని ఈ సారి ఆ స్వరములో బాధ వ్యక్తమయింది. ఆయన అన్నాడు, "రికార్డో, రికార్డో నా సంఘము కొరకు ప్రార్ధించు! నా సంఘము మునుపటివలె లేదు!! ఈ భూమియందున్న నా సంఘము మారిపోయింది. తన విశ్వాసాన్ని అది కోల్పోయింది. నాయందు గాని నేను ఉన్నానని గాని నా సంఘము విశ్వసించడము లేదు! నేను ఉన్నానని నా సంఘముతో చెప్పు! నా సంఘముకొరకు ప్రార్ధించు, ఎందుకంటే నా సంఘము ప్రార్ధించదు, ఎంత మాత్రమూ ఉపవాసముండదు!" ఆయన మాట్లాడము ముగించగానే భూ కంపనము ఆగింది. నేను దేవుని సంఘము కొరకు ప్రార్ధించడం మొదలుపెట్టాను. మిగిలిన నాలుగు గంటల సేపు సంఘము ఉజ్జీవము పొందాలని దేవుని దగ్గర వేడుకున్నాను.

ప్రార్ధన కాలములో రెండవ వారము గురువారము నాడు, నా యెముకలలోను కీళ్ళలోను గొప్ప బాధ కలిగింది. నాకు లేవాలని ఎంత మాత్రమూ లేదు.

అమ్మ నన్ను లేచి ప్రార్థించుటకు ఆలయానికి వెళ్ళమనగా నా శరీరములోను ఎముకలలోను ఉన్న నొప్పిని గూర్చి ఆమెతో చెప్పాను. అప్పుడు ఇంట్లో ఉండే నేను ప్రార్థించాలని ఆమె సూచించింది. కానీ, ఆలయానికి వెళ్ళే ప్రార్థించాలని ప్రభువు చెప్పిన మాటను గుర్తు చేసుకుని, నిశ్చయంతో సిద్ధపడి అమ్మ సహాయంతో ఆలయానికి వెళ్ళాను. ఆ ఉదయం అనేకులు ఆలయములో ప్రార్థిస్తున్నారు. నా శరీరములో నున్న నొప్పి నిమిత్తము నా కొరకు ప్రార్థించాలని వారినడిగాను. అప్పుడు వారు నాకు నూనె రాచి నా శరీర స్వస్థత కొరకు ప్రార్థించగా నేను దేవుని దగ్గరనుండి శక్తిని పొందాను. హల్లెలూయ! ప్రార్థించుటకును ముందుకు వెనుకకు నడుచుటకును ప్రారంభించాను. అప్పుడు చిలీ దేశాన్ని, చిలీలోని కుటుంబాలను, మత్తుకు బానిసలై ఉన్న వారిని దేవుడు కనికరించాలని ఆయనను వేడుకున్నాను. సంఘమునకు ఆయన దయచూపాలని ఆయనను ప్రార్థించాను.

నేను ప్రార్థించి ముగించిన తరువాత రాత్రి ప్రార్థన కూటమికి మరలా వచ్చాను. సంఘ పెద్ద ఆశీర్వాద వచనములు ముగిసిన తరువాత, నా చేతులను పైకెత్తాను. అప్పుడు ఎవరో వెళుతూ నా వెన్నును ముట్టారు. ఇది జరిగినప్పుడు నేను నా శక్తినంతా కోల్పోయి నేలకొరిగాను. సంఘ పెద్ద ఏమైందని నన్నడిగినప్పుడు, ఏమైందో తెలియదు గాని, నాయందు బలమేమాత్రమూ లేదు, మాట్లాడలేక పోతున్నానని ఆయనతో చెప్పాను.

అప్పుడు విశ్వాసులు నా చుట్టు వచ్చి అన్య భాషలతో మాట్లాడుతూ కేకలు వేయడం ప్రారంభించారు. అప్పుడు ఒక దేవదూత వచ్చి నన్ను నా శరీరాన్ని విడిచిపెట్టమని చెప్పడం కొంతమంది చూడగలిగారు. సంఘు పెద్ద అన్నాడు, *"నువ్వు నీ శరీరాన్ని విడిచిపెట్టవు."* ఆయన ఈ మాటలంటుండగా ఆ దేవదూత నా శరీరాన్ని కదపడము నిలిపివేసింది. చూశారా, యేసునందు అధికారము పొందినవారి మాటలను ప్రభువు దూత గౌరవిస్తాడు.

అప్పుడు సంఘు పెద్ద నన్నడిగాడు, *"ఎంత కాలము నీ శరీరము నుండి నిన్ను వేరుపరచాలని దేవదూత ఉద్దేశము?"* అప్పుడు నేను దూత నడిగాను, "నన్ను ఎన్ని *గంటల పాటుగా తీసుకెళ్తునావు? ఒక గంటా? రెండు గంటలా? మూడు గంటలా? "* దూత అన్నది, "*కాదు,* నువ్వు *ఎనిమిది గంటల పాటుగా మూడవ పరలోకమునందు యేసు నీతో మాట్లాడు నిమిత్తము తీసుకెళ్ళబడుతున్నావని చెప్పింది."* అప్పుడా దూత నాతో అంది, *"నేను నీ కాపలా దూతను. దివారాత్రములు ఈ భూమినందు నీ జీవితకాలమంతా నిన్ను కాపాడాను. అయితే, నిన్ను మూడవ పరలోకమునకు నడిపించునది నేను కాదు. పరలోకము నుండి మధ్య రాత్రి వేళ ఇద్దరు దూతలు వచ్చి నిన్ను మూడవ పరలోకమునకు తీసుకెళ్తారు."* నేను ఇదే విషయాన్ని సంఘు పెద్దతో చెప్పాను. అప్పుడాయన నన్ను వెంటనే కారులో ఎక్కించి మరొక సంఘు పెద్ద ఇంట్లోని రెండవ అంతస్థుకు నన్ను తీసుకెళ్ళాలని నిర్ణయించారు.

నేను ఒక గదిలో పడుకుని ఉండగా, జనములు బిగ్గరగా ఏడ్వడము, కుక్కల శబ్దాలు మాకు వినబడుతున్నాయి.

ఈ నా అనుభవము తరువాత, తెల్లని వస్త్రములు ధరించిన ఇద్దరు మనుష్యులు వీధి మధ్యన ప్రత్యక్షమయ్యారని, అక్కడినుండి భవనపు మొదటి అంతస్థునకును నేనున్న రెండవ అంతస్థునకును వచ్చారని నాకు తెలుపబడింది. ఈ దేవదూతలు చాలా అందమైనవి. వారి వెంట్రుకలు హిమముకంటె తెల్లనివియు, వారి కళ్ళు ముత్యముల రూపమున తీర్చబడినవియునైయున్నవి. వారి చర్మము పసికందు చర్మమువలె సున్నితమైనది గాని వారి శరీరములు యోధుల శరీరముల వలె కండలు తిరిగినవి. ఈ దూతలు మహా బలముగలవి!! అప్పుడు నేను సంఘ పెద్దతో నన్ను పరలోకమునకు తీసుకెళ్ళు నిమిత్తము పంపడిన దూతలు ఇక్కడ ఉన్నాయని చెప్పాను. వారిలో ఒక దూత నా శరీరాన్ని విడిచిపెట్టమని నన్ను కదపడము ప్రారంభించింది. ఇది జరిగినప్పుడు మరలా నా ఎముకలలో నొప్పి కలిగింది. నా చుట్టు ఉన్న సహోదరులు నా శరీరాన్ని వేడిపరచాలని ప్రయత్నిస్తున్నారు. నా శరీరం వేగంగా చల్లబడుతోందని వాళ్ళు నాతో చెప్పారు. వాళ్ళ ప్రయత్నాలు ఫలింపకపోగా నా శరీరాన్ని వేడిపరచడానికి ఊష్ణోపకరణాలను తెచ్చారు. దేవదూతలు నన్ను నా శరీరాన్ని విడువమని చెబుతుండగా నేను అసహనతతో ఈ వైపునకు ఆ వైపునకు దొర్లడము ప్రారంభించాను.

నా శరీరాన్ని మరణము వహించడము చూచి క్రీస్తునందు నా సహోదరులతో బిగ్గరగా చెప్పాను, "నన్ను పూడ్చకండి. నేను మరలా వస్తాను!."

నేను నా శరీరాన్ని విడిచిపెట్టి నా పడకమీద ఉత్సాహంతో లేచి నిలబడ్డాను. క్రీస్తునందు నా సహోదరులు నా శరీరాన్ని తాకి చూచి, *"ఇక లేడు. ఇతను తన శరీరాన్ని విడిచిపెట్టాడు! "* అని చెప్పడం ప్రారంభించారు. కానీ నేనైతే వాళ్ళ పక్కనే ఉన్నాను, వాళ్ళతో చెబుతున్నాను, *"నేనిక్కడే ఉన్నాను."* వాళ్ళయితే నా మాటలు వినలేకపోతున్నారు. నా శరీరము క్షయములేని ఆత్మ శరీరమైనందున నన్ను చూడలేకపోతున్నారు. నా సహోదరులు నన్ను ఒక దుప్పటిలో చుట్టడము ప్రారంభించారు.

వారిలో ఒక దూత నాతో అన్నది, *"ఇక వెళ్ళాలి, ప్రభువు నీ కోసము వేచియున్నాడు!"* ఇద్దరు దూతలు చెరో పక్క నా కరములను పట్టి నన్ను పరములకు తీసుకెళ్ళారు. నేను మెరుపు వేగముతో భూ మండలుము గుండా భూ ఆవరణమును దాటి వెళ్ళాను. మీరు దీనిలో ఏది నమ్మకున్నా సరే, ఒక విషయము మీతో చెబుతాను, "నా యేసు క్రీస్తు ఎన్నటెన్నటికినీ జీవించియున్నాడు."

పిమ్మట, ప్రభువు నా శరీరమునకు నన్ను తిరిగి వెళ్ళమని చెప్పినపుడు, ఆయనతో అన్నాను, *"భూమియందు నన్నెవరు నమ్ముతారు? నేను*

*మీతోనే ఉండిపోతాను!! నేను చెప్పినా నాకు బయలుపరచబడినది ఎవ్వరూ నమ్మరు. ఎవ్వరికీ విశ్వాసము లేదు గనుక ఎవ్వరూ నమ్మరు! భూమి మీద అవిశ్వాసము బహు గొప్పదిగా ఉన్నది, నా ఈ అనుభవమును నమ్మేదెవరు?"* ప్రభువు అన్నాడు, "నా నిజమైన సంఘమునకు చేరినవారు నీ అనుభవమును నమ్ముతారు."

నా శరీరమును విడిచిన ఆ రాత్రి అద్భుతమైన వేగముతో నేను ప్రభువును దర్శించడానికి వెళుతున్నాను. క్రిందనున్న భూ గ్రహమును నేను చూడగలుగుతున్నాను. ఇంకా సాగి, రాత్రి జాములలో ఆకాశాన్ని ప్రకాశింపజేసే చంద్రుని పక్కగా వెళుతున్నాను. తరువాత, నా కళ్లతో ఆ గొప్ప సూర్యుడిని చూస్తున్నాను. భూమికి ఉష్ణమునిచ్చే సూర్యునినుండి ఎగిసిపడే జ్వాలలు నేను చూడగలుగుతున్నాను. మేము ఇంకా సాగిపోగా, అనేక నక్షత్రాలను వాటి పక్కగా వెళుతూ చూశాను. దేవుడు నేను సూర్యుడిని, చంద్రుడిని, నక్షత్రాలను చూడగలిగినట్లు అనుగ్రహించడము వెనుక ఒక ఉద్దేశమున్నది. మీ అందరికీ మన దేవుడు ఈ విశ్వము యొక్క మహా గొప్ప సృష్టికర్త అని చెప్పడమే ఆ ఉద్దేశము!! ఆయన ఎంత మాత్రమూ అల్పుడు కాడు!

మేము అదే అద్భుత వేగముతో వెళుతూ ఉండగా ఇక నక్షత్రాలే లేని చోటికి చేరుకున్నాము. సృష్టి ఇక లేదు, కేవలము చీకటే. నా క్రిందుగా నక్షత్రాలను నేను చూస్తున్నాను. నాలో భయము ప్రారంభమయింది. దూతలనడిగాను,

*"నన్నెక్కడికి తీసుకెళుతున్నారు? దయచేసి నన్ను తిరిగి భూమిలోనున్న నా శరీరము దగ్గరికి తీసుకెళ్ళండి! "* అప్పుడు వారు నన్నింకా గట్టిగా పట్టుకుని వారి పాదాలలో చెరొకటి నాకు తగిలించి నన్ను బిగువుగా పట్టుకున్నారు. నాకు కలిగిన భయమువలన నేను ఒరిగిపోవడము ప్రారంభించాను. దూతలన్నారు, *"ఊరకుండు*! మేము నిన్ను యేసు నీతో మాట్లాడడానికి ఎదురుచూస్తున్న మూడవ పరలోకమునకు తీసుకెళుతున్నాము!" దేవదూతలు ఆగారు. ఆ క్షణములో, నేను ఏ దిశగా చూచినా సృష్టింపబడినదేదీ నాకు కనబడలేదు. నేను ఎక్కడున్నానో నాకు తెలియదుగాని, అది రెండవ పరలోకమని అనుకుంటున్నాను.

అప్పుడు బోర్లా ఉన్న నన్ను నేను నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నాను. దూతలయితే నన్ను పట్టుకుని ఉన్నారు. అప్పుడు నా పైన ఒక గొప్ప తరంగపు ధ్వని నాకు వినబడింది. దూతలు నన్ను ఇంకా గట్టిగా అదిమిపట్టి నాతో అన్నారు, *"రికార్డో, భయపడకు, యేసు మనతో ఉన్నాడు!"* వాళ్ళింకా నాతో మాట్లాడుతూ అన్నారు, *"నీ తల ఎత్తి పైకి చూడు!"* పైన నేను చూచిన దానిని గూర్చి ఆశ్చర్యపడ్డాను.

ఎందుకంటే, మా పైన కొన్ని జీవులు కదులుతున్నట్లు కనిపించింది. ఒక దూత అంది, *"చూడు, మనకు పైగా నువ్వు చూస్తున్నదాన్ని నీకు చూపిస్తాను!"* అప్పుడు ఒక దూత తన చేతిని ఒక వైపునుండి మరో వైపునకు ఊపగా ఆకాశమంతా వెలుగులో స్పష్టంగా కనబడసాగింది.

ఆకాశము కనబడినప్పుడు అక్కడ దయ్యములు దురాత్మలే తప్ప మరేమీ లేవు. అవి ఆకాశము మొత్తమును ఆక్రమించి ఉన్నాయి. **యేసు నామమున ప్రభువు వాటన్నింటినీ గద్దించును గాక!!** పరిశుద్ధ గ్రంధము సత్యము!! ఈ భూమిలో జరిగే ప్రతిఒక్కటీ ప్రకటన గ్రంధములో మనము చూసేవే. యేసు త్వరలో వచ్చుచున్నాడు!! దీని విషయమై నేను మిమ్ములను ఎలా నమ్మించగలను? ప్రభువు రాకడ బహు **సమీపము**!!. నేను ఆ దూతనడిగాను, *"ఇది ఏ స్థలము ?"* వారిలో ఒక దూత అన్నది, *"ఇది అంధకారపు ఆకాశ సైన్యముండు స్థలము. ఇది సాతానును వాని దూతలకును నివాసస్థలము."* నేననుకున్నాను, *"అందుకే ఇంత దుష్టత్వము భూమిమీదనున్నది! ఈ దయ్యములు ఈ చోటి నుండి భూమిలోనికి వచ్చి మనుష్యులకు ప్రతివిధమైన నాశనమును మోసమును కలుగజేస్తున్నాయి. భూమి దయ్యములతో నిండి ఉన్నది!"* వేల లక్షల కోట్ల కొలది లెక్కించలేనన్ని దయ్యములు ఈ భూమిలో ఉన్నవి.

s తరువాత ఆ దూతలు తమ చేతులను మరో సారి ఆకాశము వైపుగా ఒక వైపు నుండి మరోవైపునకు ఊపాయి. అప్పుడు నేను ఆ జీవుల యొక్క ముఖములను చూడగలిగాను. ఆ భయంకర ముఖములు మనకు ఇంతకాలము







టి.వి.లలో చూపబడిన జీవుల ముఖములే. ఇవి చాలా క్రూరమైనవి. పిల్లల కథా చిత్రాలలో బెన్ టెన్ వంటి వాటిలో ఉండే విచిత్ర ముఖాలు, భయోత్పాదక చిత్రాలలోని క్రూర ముఖాలను నేను నేరుగా చూశాను. ఈ చిత్రాలను రూపొందించే వారంతా ఈ విధమైన ముఖాలను టి.వి లలో చూపించడానికి దయ్యాలతో ఒప్పందము చేసుకుని ఉన్నారు!! ఆ గీయబడే చిత్రాలన్నీ నేను చూసిన ఆకాశపు సైన్య ప్రదేశమునుండి వచ్చినవే. ఈ రోజుల్లో పిల్లలు ఇంతగా తల్లిదండ్రుల మాటలను ఎందుకు ఎదిరిస్తున్నారనుకుంటున్నారు?? ఎందుకంటే ఈ విధమైన చిత్రాలను మీ పిల్లలు చూచినప్పుడు ఆ దయ్యాలు వాటి ప్రదర్శనానుసారము వారిలోనికి ప్రవేశిస్తాయి.

అందుకే మన పిల్లలు టి.వి లో ఏమి చూడాలో మనము వారికి నేర్పించడం అలవరుచుకోవాలి. ఆ దూత నేను చూస్తున్నది, లోకములో జరుగుతున్నదంతా నిజమని నాతో అన్నది. ఈ దయ్యాలన్నీ ఉన్నాయి, ప్రజలు వీటితో ఒప్పందము చేసుకుంటూ వాటిని మన భూమికి తీసుకొస్తున్నారు. ఈ దయ్యాలు నన్ను, సంఘమును, తండ్రిని, యేసుక్రీస్తును, ఈ భూమిని శపించడం మొదలుపెట్టాయి. అవి ఎంతమాత్రము దేవుణ్ణి గాని ఆయన సృష్టిని గాని గౌరవించనేరవు.

ఆ తరువాత హుగో అనబడిన ఒక మరుగుజ్జును శరీరరూపకముగా చూశాను. ఇది చిలీ దేశములో ప్రసిద్ధి పొందిన ఒక వ్యంగ్య చిత్రము. ఇది పిల్లల కోసము రూపొందించబడినది. అతను చూడడానికి చాలా భయంకరముగా ఉన్నాడు. అతను నా దగ్గరకు వచ్చి నాతో అన్నాడు, *"మేము భూమిలోనికి వెళ్ళి పిల్లలనందరినీ చంపేస్తాము!"* పిల్లలు పిల్లలను చంపుతున్నారు. ఇది ఎందుకు జరుగుతున్నదనుకుంటున్నారు? అటువంటి పిల్లలలో కొంతమంది అనేది ఏమిటో తెలుసా? ఏదో వచ్చి నన్ను ఇది చేయమని అది చేయమని చెప్పిందని వారంటున్నారు. ఈ దయ్యాలు భూమిమీద ద్వేషములను విరోధములను నాటుతున్నాయి. ప్రభువు చిలీ దేశాన్ని కడుగును గాక!! ఒక దూత నాతో అన్నది, *"ఇంకా చూడు."*

ఆ దయ్యాలు ఇంకా అన్నాయి, *"మేము సంఘమును నాశనము చేయాలని చూశాము. కానీ, మేము చెయ్యలేకపోతున్నాము. ఎందుకంటే, మేము ఒకడిని చంపినప్పుడు, వానికి బదులుగా వేవేల మంది దేవునికొరకు నిలబడుతున్నారు!"* సంఘము ఆరంభమయిన నాటినుండి, సాతాను సంఘమును, నిజముగా సత్య వాక్యమును ప్రకటించు సంఘమును నాశనము చేయాలని ప్రయత్నిస్తోంది. కానీ వాని వల్ల కాదు. ఎందుకంటే ప్రభువైన యేసు క్రీస్తు మనలను కాపాడుతున్నాడు! దేవునికి మహిమ కలుగును గాక!. తరువాత ఆ దయ్యములు అన్నవి, *"ఏదైనా కొత్తదిగా చేద్దాము. సంఘములలో ప్రవేశిద్దాము. అనేక సంఘములు మన వశమున ఉన్నవి గదా! ఈ ప్రజలను ఉపయోగించి సంఘ సోదరుల మధ్య పుకార్లు పుట్టించి వారిని విడగొడదాము. సంఘములు పడులాగున చేద్దాము. అపుడు పరిశుద్ధాత్ముడు దుఃఖపడి సంఘమును విడిచిపెడతాడు."* సాతాను ప్రతిచోటికి తిరిగి దేవుని న్యాయమును ప్రేమించేవారిని నాశనము చేయజూచును. ఇదిగో ఈ వాక్యములో వ్రాయబడినలాగున -

1 పేతురు 5:8

నిబ్బరమైన బుద్ధి గలవారై మెలకువగా ఉండుడి; మీ విరోధియైన సాతాను గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు.

నేను ఇకను ఏమీ చూడదలచలేదు. కానీ జరుగుతున్న వాటిని ఇకను చూడమని దూత నాతో అన్నది. ఒక తేజోమయమైన మెరుస్తున్న నక్షత్రము రాగా, దయ్యములన్నీ పారిపోవడము చూశాను. ఈ నక్షత్రము దగ్గరకు వస్తున్న కొలది, ప్రభువుకు స్తుతిని, ఆరాధనను తీసుకొస్తోంది. ఈ నక్షత్రము నక్షత్రమే కాదు. ఇది తెల్ల గుఱ్ఱముల మీద సైన్యములకు అధిపతియైన ప్రభువును స్తుతిస్తూ వస్తున్న వేవేల దూతల సమూహము!! వారు అరుస్తున్నారు, *"పరిశుద్ధుడు,పరిశుద్ధుడు,పరిశుద్ధుడు, యుగయుగములు జీవించియున్న వాడు పరిశుద్ధుడు! ఆల్ఫాయును ఒమేగాయును ఆదియును అంతమును ప్రభువే. జీవమున్న ప్రతిదీ ప్రభువును స్తుతుంచును గాక! "* తరువాత నేను ఒక గొప్ప యుద్ధాన్ని చూశాను. దయ్యములు ఇకను నాకు కనబడలేదు. *"ఇకనెంతమాత్రమును భయపడకుడి, ఎందుకనగా విరోధి పక్షముననున్న సైన్యముకంటే మనతో ఉన్న దూతల సైన్యము గొప్పది."*

ఆ దూతలు మూడవ పరలోకమునకు దారిని సిద్ధపరిచాయి. అవి రెండు భాగాలుగా కుడికి ఎడుమకు విడిపోయాయి. అప్పుడు తిన్నని సరాళ మార్గము మూడవ పరలోకమునకు ఏర్పడింది! ఇదే పరలోకమునకు దారి.

ఈ దారి గుండా ఆకాశమందున్న దేవుని పట్టణమును చూడగలుగుతున్నాను. (ఒక ఉపగ్రహము ఈ పట్టణమును చిత్రీకరించినది. ఈ పట్టణము ఉన్నది! ఈ విషయము వార్తా మాధ్యమముల ద్వారా ప్రచురింపబడింది.) నేను ప్రకాశమానమైన అద్భుతమైన దూతలు నిలిచియున్న ఈ మార్గమును చూడగలుగుతున్నాను. ఆ దూతలు దురాత్మలయొక్కయు దయ్యములయొక్కయు సమూహములతో నిండియుండియున్న ఆ ప్రదేశమును జయించిన తరువాతయినా దేవుణ్ణి స్తుతించడము, ఆయన పరిశుద్ధ నామమును కీర్తించడము ఎంతమాత్రమూ నిలుపలేదు! ఆ దూతలు నన్ను వాటి ముందు నిలబెట్టి నాతో అన్నారు, *"నువ్విక్కడ వేచి ఉండాలి."*

కొంత దూరమున నేను చూడగా, ఆ ఆకాశ పట్టణమునుండి ఒక వ్యక్తి తెల్లని వస్త్రములు ధరించి తెల్లని గుఱ్ఱము మీద రావడము కనబడింది. అతను నాకు దగ్గర పడుతున్న కొలదియు దేవదూతలు దేవుణ్ణి స్తుతిస్తూనే, ఆయన నామమును గొప్ప చేస్తూనే ఉన్నారు. ఆ వ్యక్తి నాకు బహు దగ్గరగా రాగా, అతనిని చూచాను. ఈ వ్యక్తి ఇతర దూతలకంటే చాలా అందంగా ఉన్నాడు. నేను అతను నాతో మాట్లాడుతాడని ఆశించాను గాని, నా వైపుగా కాసేపు చూచి, బిగ్గరగా నాతో అన్నాడు, *"నేను! నేను ప్రధాన దూతయైన మిఖాయేలును. నిన్నును భూమియందున్న సంఘమును కాపాడడము నా పని!"*

నేను ప్రధాన దూతయైన మిఖాయేలును ముఖాముఖిగా దర్శించాను. అతను చాలా మహిమగలిగినవాడు. అతడు తన ప్రక్కకు తిరిగి ఆకాశ పట్టణము వైపునకు తన చేతిని చూపాడు. అతనన్నాడు, *"ప్రవేశించు! ప్రభువైన యేసు నీ కోసము ఎదురుచూస్తున్నాడు!"* నేను ఆ పట్టణమునకున్న మార్గములో నడుస్తుండగా దేవదూతలు గొప్ప శబ్దముతో ప్రభువును స్తుతించుచు ఉన్నారు. ఆ పట్టణమును నేను చూచిన కొలది ఏడుస్తూనే ఉన్నాను.

నిర్మలమైన పారదర్శకమైన బంగారముతో ఆ పట్టణము నిర్మించబడింది. దాని ప్రవేశ ద్వారము ముత్యములతో చేయబడినది. దాని నేల స్ఫటికమయము. ఈలాంటిదేదీ భూమిలో నేను చూడలేదు, మనుష్యుడు దీనిని చేయజాలడు. దాని రూపకర్త సర్వలోకాధిపతియు మన ప్రభువునైన దేవుడు. నేను పట్టణపు వెలుపట నున్నాను, దాని తలుపులు బాగా తెరువబడియున్నవి. ఆ తలుపులు ఇంకనూ తెరువబడే ఉన్నవి. నేను లోపలకు చూచినప్పుడు దాని గోడలపైన ప్రశస్తమైన కెంపులు, నీలరత్నములు, ముత్యములు పొదగబడియున్నవి. దేవుణ్ణి స్తుతిస్తున్న వేవేల స్వరాలను ఆ పట్టణములో విన్నాను. ఇది విని పట్టణము బయట ఉండగానే నేను వణికిపోయాను. అప్పుడు ఒక స్వరము విన్నాను. ఆ స్వరము ఆకాశమును కంపింపజేసింది. ఆ స్వరము వెనుక వేవేల స్వరాలు దేవుణ్ణి స్తుతిస్తూ ఇలా అన్నాయి, *"పరిశుద్ధుడు,పరిశుద్ధుడు,పరిశుద్ధుడు.*

*దేవుని గొఱ్ఱెపిల్ల పరిశుద్ధుడు. పరిశుద్ధుడు,పరిశుద్ధుడు,పరిశుద్ధుడు తండ్రి పరిశుద్ధుడు. వారికే యుగయుగములు మహిమ ప్రభావములు చెందును గాక. ఆమేన్."* ఆ గొప్ప స్వరము ధ్వనించింది, "నేను పరిశుద్ధుడను గనుక మీరును పరిశుద్ధులుగా ఉండుడి! పరిశుద్ధులే ఈ స్థలమునందు ప్రవేశించెదరు! పరిశుద్ధత లేని వాడెవడును ప్రభువును చూడడు." పరిరిశుద్ధత లేని వారు ఆయనను చూడరు.

ఒక స్వరము అన్నది, *"ప్రవేశించుడి."* అప్పుడు నేను పట్టణములో ప్రవేశించాను. అక్కడ అగ్నితో మండుచున్నట్టి ఒక అద్భుతమైన సింహాసనమును చూచాను. ఆ సింహాసనము నుండి అగ్ని బయలుదేరుచుండగా నేను లక్ష్యముంచి రాజుల రాజును ప్రభువుల ప్రభువునైన యేసును చూచాను. అప్పుడు శరీమందు బలము క్షీణించిన వాడనై ఆయన ఎదుట నేలమీద సాగిలపడ్డాను. ఆ అగ్ని జ్వాలలనుండి ఆయన చేయి నా వైపుగా చాచి నాతో అన్నాడు, "లేచి నలబడు!" బలము కూడజేసుకుని లేచి నిలబడ్డాను. వెంటనే ఆయనకు దగ్గరగా వెళ్ళి ఆయన పాదములను, చేతులను, శరీరమును తాకి చూడనారంభించాను. ఆయన ముఖమును చూడగా, అది భూమియందు చిత్రకారులు గీచెడి రూపము వలె లేదు. అనేకులు చెక్కతోను అనేక లోహాలతోను దేవుళ్ళను రూపిస్తారు. కానీ నేను మీతో చెప్పేదేమిటంటే ప్రియ సహోదరులారా, యేసు వాటిలో ఒక దాని వలె నాకు కనబడలేదు. ఆయన బలవంతుడైన దేవుడు.

ఆయన కొంత బలము కలిగినవాడూ కాడు, మహా బలము కలిగినవాడు!! ఆయన అన్నాడు, "నేను సున్నముతోను చెక్కతోను చేయబడిన దేవుడను కాను. నేను ఉన్నవాడను జీవించు దేవుడను." ఆయన ఇంకా అన్నాడు, "నా సంఘముతో చెప్పు నేను నిజమైనవాడినని!!! నేను జీవించువాడను ఉన్నవాడను. నా ప్రజలతో చెప్పు పరలోకము నిజమని, నేను వారి నిమిత్తము వేచి ఉన్నానని!"

ఆయన నాతో అన్నాడు, "నాతో నడచి రా, నేను నీకు ఒక గొప్ప కార్యమును చూపిస్తాను." మేము నేలనుండి క్రిందకు చూడగా భూమిని, అందులో జరుగు సమస్తమును చూడగలుగుతున్నాము. యేసు అన్నాడు, "నా సంఘము చేయు ప్రతి పనిని నేను చూస్తున్నాను!" మనము చేసే ప్రతి కార్యము ఆయనకు తెలుసు. పరలోకము నుండి నేను చూడగా మీలో అనేకులు నాకు కనబడితిరి. యేసు నాతో అన్నాడు, "నా సంఘమును చూడు." అప్పుడు నేను చూచాను. సహోదరునికి విరోధముగా సహోదరుడు, సంఘములకు విరోధముగా సంఘములు. యేసు చెప్పాడు, "నా సంఘము తన విస్వాసమును కోల్పోయింది. వాళ్ళు నన్ను నమ్మదలచుకోలేదు. భూమిపైన కపటము విస్తరించింది. ఇందువలన నేనున్నానని సయితము ప్రజలు నమ్మకూడదని ఉన్నారు. నా ప్రజలతో చెప్పు నేను ఒక గొప్ప కార్యమును భూమిలో చేయబోతున్నాని! నా సంఘము వృద్ధి చెందవలసియుండగా నాశనము వైపుగా అడుగులు వేస్తోంది."

ప్రభువు తన సంఘమును గూర్చి ఏడ్వడము ప్రారంభించాడు. ఆయన అన్నాడు, "ఈ సంఘము నా సంఘము కాదు." నేనన్నాను, "ప్రభువా, *ఆలాగనకండి!* మేము నీ ప్రజలమే." అందుకు బదులిస్తూ ప్రభువన్నాడు, "నా సంఘము సూచనలు, అద్భుతాలలోనే చలిస్తోంది! నా సంఘము తగ్గిపోయింది! కానీ వారితో చెప్పు, వాళ్ళను మరల బ్రదికించుటకు నేను వస్తానని!"

ఆయన తనతో ఇంకనూ నడువమని చెప్పగా మేము ఒక ద్వారము ద్వారా ప్రవేశించాము. అక్కడి నేల స్వచ్ఛమైన బంగారము. ఆ బంగారు వీధిలో నెను ఆ వైపునకు ఈ వైపునకు పరుగెత్తడము ప్రారంభించాను. అక్కడ ఉన్న బంగారు ధూళి నా మీద చల్లుకోవడము ప్రారంభించాను. నన్ను ప్రభువు వెనుకకు రమ్మని చెప్పి, బంగారు వీధులు పరలోకమందున్నవని మీతో చెప్పమన్నాడు. ప్రభువన్నాడు, "ఈ సమస్తము నా ప్రజలకు సొంతము. కానీ, నా సంఘములో నా అర్పనములను దశమభాగములను దొంగిలెడి వారున్నారు! నా ప్రజలతో చెప్పు ఏ దొంగయు పరలోకమందున్న నా రాజ్యమందు ప్రవేశించడని!" మనము ప్రభువు కొరకు మన జీవితాలను చక్కపరచుకోవాలి. తరువాత మేము ఒక గొప్ప బల్లను చూచాము. అది ఎన్నో కోట్ల మంది కూర్చుని భోజనము చేయగలిగినంత పెద్దది.

ఆ పొడవాటి బల్ల మీద కావలసినంత ఆహారము, పానీయములు కలవు. అక్కడ కిరీటములు, ప్రజలు త్రాగుటకు స్పటికముతో చేయబడిన గుండ్రని

పాత్రలు అనేకము కలవు. ప్రభువన్నాడు, "రికార్డో, ఇది నా ప్రజల కోసము సిద్ధపరచబడినది!" ఇది గొఱ్ఱెపిల్ల యొక్క పెండ్లి విందు నిమిత్తము సిద్ధపరచబడినది.

క్రీస్తులో ఉన్న ఒక సహోదరి కూడా పరలోకమునకు తీసుకెళ్ళబడింది. ఆమె వెళ్ళినప్పుడు దేవదూతలు ముందుకు వెనుకకు సంచరిస్తూ పెండ్లి విందును సిద్ధపరుస్తూ ఉన్నారు. నేను ప్రభువును అడిగాను, *"ఎందుకు ఈ సహోదరి విందు ఏర్పాట్లను చూడగలిగింది, కానీ నేను ఏ ఏర్పాట్లనూ చూడలేకపోతున్నాను? "* ప్రభువన్నాడు, "ఎందుకంటే అన్ని ఏర్పాట్లూ ముగిశాయి." ప్రభువుకు లోబడి పనిచేసేవారికి అక్కడ కిరీటములు ఉంచబడి ఉన్నవి. నేనన్నాను, *"ప్రభువా, సర్వమూ సిద్ధమైనట్లయితే మీ రాకడ ఎప్పుడు? మీరు తిరిగి రావడానికి ఇంకెంత కాలము? పరలోకపు ఘడియారములో ఇంకెంత సమయము మిగిలున్నదో నాకు చూపించండి."* అనేకులు కలలో మధ్య రాత్రిని చూపించే ఘడియారమును చూచి ప్రభువు రాకడ సమయమదే అంటున్నారు. నేనడిగాను, *"ప్రభువా, ఘడియారపు ముల్లు అర్ధరాత్రిని తాకేదెప్పుడు? ఇంకా ఎంత సమయము మిగిలుంది? ఒక నిముషమా? అయిదు నిముషాలా? "* యేసు నా ముఖమును తేరి చూచి నాతో అన్నాడు, "రికార్డో, పరలోకములో ఘడియారమనునది లేదు." నేనడిగాను, *"అయితే ప్రభువా ఇక్కడ సమయమనేదే లేకపోతే, మీరు ఇకను ఎందుకు రాలేదు?"* అప్పుడు యేసు ఆయన చేతిని పైకెత్తి

బ్రొటన,చూపుడు వ్రేళ్ళతో చిన్నదనుటకు సంజ్ఞచేసి అన్నాడు, "మిగిలున్నదంతా విశ్వాసము నందు సోలిపోయిన వారి నిమిత్తమునున్న తండ్రి యొక్క అనుగ్రహ కాలము మాత్రమే. ఇది వారు మారుమనస్సు పొందుకొని మొదటి కార్యములు చేయుటకు వారికి దయచేయబడినది." సైన్యములకధిపతి ఇకను రాకుండుటకు కారణము మనకివ్వబడిన ఈ కాస్త సమయమే. దీనికి తండ్రి యొక్క అనుగ్రహ సమయమని పేరు. యేసు ఏ క్షణమున అయినా రావచ్చు. మనము ఆయనను మన పూర్ణ హృదయముతో వెదకి, ఉపవాసముండి ప్రార్థించి, ఆ మొదటి క్రియలను చేయవలెను. యేసు మరలా అన్నాడు, "ప్రజలు దేవుని అనుగ్రహ కాలములో ఉన్నారు!"

అప్పుడు మాకు కుడివైపున ఒక దూత ప్రత్యక్షమై బిగ్గరగా అన్నది, *"కాలము నెరవేరినది!! కాలము నెరవేరినది!! కాలము సంపూర్ణమయింది. ప్రతి ఏర్పాటు పూర్తయింది! యేసు ఆయన వధువును ఆహ్వానిస్తున్నాడు!"* మన ప్రభువు వస్తున్నాడు. పవిత్ర గ్రంధములోని ప్రతి సూచనా నెరవేరినది! చిత్రాలలో ఏదో పెను ఉప్పెన ముంచుకు రాబోతోందని చూపెడతారు. ఏదో భయంకరమైనది జరుగబోతున్నదని శాస్త్రవేత్తలకూ తెలుసు. కానీ అది ఏమిటి అన్నదే వాళ్ళకు తెలియని విషయము.

కానీ, ఆయన సంఘముగా ఉన్న మనకు తెలుసు, యేసు త్వరలో రాబోతున్నాడని! ఆ దేవదూత బిగ్గరగా ప్రకటించిన తరువాత, వేవేల

దూతలు ఎగురుతూ సంతోషముతో వధువు రాకడను బట్టి హర్షిస్తున్నారు. నేను ఏమి జరిగిందని వాళ్ళనడిగాను. ఎవ్వరూ నన్ను దృష్టించలేదు. ఎన్ని సార్లు వాళ్ళనడిగినా వాళ్ళు నా వైపుగానైనా చూడడము లేదు. వాళ్ళంతా ఈ సువర్తమానమును బట్టి హర్షిస్తున్నారు. కావున నేను సయితము ఆ దూతలతో కలిసి యేసు నామమును స్తుతించడము మొదలుపెట్టాను. ఆ ఘడియలో, నా చేతులను నేను పైకెత్తినప్పుడు ఎవెరో నన్ను పరలోకము నుండి తీసి అమితమైన వేగముతో క్రిందికి పంపారు.

ఇప్పుడైతే, దేవదూతలు వధువు వస్తున్నదని హర్షిస్తున్నారు. నేను భూమికి తిరిగి వచ్చాను. నేను ఆలయములో ప్రతిరోజూ ప్రార్ధించే స్థలములో నేను విడువబడ్డాను. **మిగిలిన సమయము బహు కొంచము**!! నన్ను నమ్మకూడదని మీరు భావిస్తే సరే. అయితే ఆయన వస్తున్నాడు. ఇది నిరంతర సత్యముగా జరిగే కార్యము. దేవుని ప్రజలలో అనేకులు యేసు క్రీస్తు రాకడలో విశ్వాసులు ఒక్క క్షణములో పరమునకు తీసుకోబడుతారన్న మన ప్రభువు మాటను నమ్మరు. దయచేసి మేల్కోండి, దేవుని నిమిత్తమైనా సత్యానికి చెవియొగ్గండి!! (రికార్డో ఏడుస్తున్నాడు).

ప్రభువు ఇక్కడను నా ప్రక్కన నిలబడి నాతో అన్నాడు, "రికార్డో, ఒక్క క్షణములో విశ్వాసులను నేను నా యొద్దకు తీసుకొనునప్పుడు ఇలా

ఉంటుంది!" అప్పుడు నేను భూమినంతా చూడగలిగాను. అప్పుడు సర్వ భూమికి సంతోషమును సమాధానము దయచేసే బహు విలువైన పరిశుద్ధాత్మ ఈ భూమిని వదిలి వెళ్ళగా చూచాను. అప్పుడు ఒక పొగమంచు ఆలయములో ప్రవేశించి నన్ను ఆవరించింది. నేను ప్రభువునడిగాను, *"ఇది ఏమిటి?"* ఆయన అన్నాడు, "ఇదే క్షణ పరివర్తన సత్యము". అప్పుడు నేను చూడగా ప్రజలు ఆలయపు తలుపులు బద్దలుగొడుతూ అడుగుతున్నారు, *"మా పిల్లలు ఎక్కడ? ఎవ్వరూ కనబడరేమి?"* భూమిలోనుండి ప్రతి బిడ్డ అదృశ్యమే. దేవుడు వారిలో ఎవ్వరినీ విడువలేదు. మొట్టమొదటగా ఆలయములో తంతి వాద్యములు వాయించెడి సహోదరుడు ఆలయములోనికి ప్రవేశించి అరుస్తున్నాడు, *"సంఘము ఎక్కడ? అయ్యో! నేను విడువబడ్డాను! నేను విడువబడ్డాను!"* అతని తరువాత, ఇంకా యితర సంఘ పెద్దలు, సహోదరులు, సహోదరిణులు, ఆలయపు పై విచారణకర్తలు, వీరంతా ఏడుస్తున్నారు, *"అయ్యో, మేము విడువబడ్డామే?"* అనేక మంది తల్లిదండ్రులు, నూతన వధూవరులు తమ ఆప్తుల కోసము వెదకుతున్నారు. వారిని చూచి ఆలయములో నున్న విడువబడినవారు అంటున్నారు, *"మీ ఆప్తులు ఇక్కడ లేరు! ప్రభువు వారిని తీసుకున్నాడు."* అప్పుడు వీరును ఏడుస్తూ అన్నారు, *"అయ్యో ఇదంతా నిజమే, యేసు వచ్చి ఆయన వధువును తీసుకెళ్ళిపోయాడు!"*

ప్రజలందరూ ఏడుస్తూ అంగలారుస్తూ తాము యేసుక్రీస్తు నందు విశ్వసించి ఉండినట్లయితే ఈ పరిస్థితి వచ్చేది కాదే, ఈ ఘోరము జరిగేది కాదే, మేము మరణము నిమిత్తము ఇలా విడువబడుదుమా అని చింతిస్తున్నారు. యేసే క్రీస్తని నమ్మని ప్రతి ఒక్కరూ దేవుని చేత మరువబడిన వారిగానే మిగిలిపోతారు. నేను అనేకులైన సంఘ పెద్దలను, ప్రజలను ఏడ్వగా చూచాను. ప్రజలు సంఘ పెద్దలను నిలదీసి అడుగుతున్నారు, "**మాకు నువ్వు సత్యాన్ని ఎందుకు బోధించలేదు?" పరిశుద్ధంగా ఉండమని నన్నెందుకు హెచ్చరించలేదు? నేను ఇలా విడువబడడము నీ తప్పే!**" పరిశుద్ధంగా జీవించనందున అనేకులు విడువబడుతారు. మనము నిజమైన పరిశుద్ధతను ప్రజలకు బోధించి వారు నిజముగా మారు మనస్సు పొందాలని బోధించాలి. అప్పుడు నేను చూశాను, ప్రజలు ఎలా సంఘ పెద్దలను పట్టుకుని కొడుతూ ఆ ఆగ్రహావేశములో వారిని జుట్టు పట్టుకుని లాగి వాళ్ళను చీరేశారు. అప్పుడు సంఘ పెద్దలు ఏడ్చి దయచేసి తమకు హాని చేయవద్దని బతిమాలుకుంటున్నారు. కానీ ప్రజలు వారినేమాత్రమూ కనికరించడములేదు, ఎందుకంటే వాళ్ళు సాతాను ప్రభావముతో నిండిపోయారు.

సంఘము సంఘమంతా మొత్తముగా విడువబడే సంఘాలూ ఉంటాయి. నేను ఒక సహోదరుణ్ణి చూశాను. అతను తనకు కలిగిన బాధ వల్ల తన సొంత కన్నులనే ఊడబెరుక్కుంటున్నాడు.

ప్రజలయితే తమ తలలను నేలకు, గోడలకేసి బాదుకుంటున్నారు. వాళ్లు యేసే ఏక సమాధామని గ్రహించలేకపోయారు. ప్రజలు పాపమునందు జీవించాలని ఆశించినందువల్ల, మోసపూరితముగా జీవించినందువల్ల, తమ యిష్టానుసారము బ్రదుకు వెళ్ళబుచ్చినందుకు వారి గతి ఇది. ప్రజలు తమను తాము కోసుకుంటూ, తమ తలలను బాదుకుంటూ తమ పుఱ్ఱెలు పగిలి తాము నేలకొరిగేంత వరకు వారి స్థితి ఇది. ఆలయాలలో రక్తము ఏరులై పారుతోంది. ఇక్కడా ప్రజలు తమను తాము గాయపరచుకుంటున్నారు. అప్పుడు ఒక యౌవనుడు దేవుణ్ణి చూచి బిగ్గరగా అరుస్తున్నాడు, *"ప్రభువా, దయచేసి నన్నును తీసుకో!"* అయితే చాలా ఆలస్యమయింది. యేసు ముందుగానే వచ్చి ఆయన సంఘమును తీసుకున్నాడు. ఇంకా ఘోరమైనవి అనేకము చూడగా నేను నేల మీద చతికిలబడ్డాను.

యేసు నాతో అన్నాడు, "గొప్ప శ్రమ కాలములో మునుపెన్నడూ లేనన్ని శ్రమలు ఉంటాయి." నేనడిగాను, *"ప్రజలు తమను తాము అంతగా గాయపరుచుకున్న పిమ్మట కూడా మరలా లేచి నిలబడుతున్నరేమి?"* ప్రభువైన యేసు బదులిచ్చాడు, "ఎందుకంటే ఈ కాలములో, ప్రజలు మరణమును ఎంతగా అపేక్షించినప్పటికీ అది వారికి దొరకదు. మరణము భూమినుండి తొలివేయబడింది." ప్రభువుని నేనడిగాను, *"ఈ సంఘు పెద్దలు, ప్రజలు ఎందుకు విడువబడ్డారు?"*

ప్రభువన్నాడు, "ఎందుకంటే వాళ్ళు నాకు తెలుసు. వాళ్ళ హృదయాలను నేనెరుగుదును." దేవునికి మనము తెలుసు. మన హృదయాలన్నీ ఆయనకు తెలుసు. నేను నేలన పడ్డాను, దాదాపు స్పృహ కోల్పోయే పరిస్థితి నాది. యేసు అన్నాడు, "నేను వీటిని నీకు చూపిన ఉద్దేశము నువ్వు నా సంఘమును హెచ్చరించగలగాలని, వారికి నమ్మకమునివ్వాలని. వారితో చెప్పు - ప్రజలు ఇప్పుడు పశ్చాత్తాపపడి మారుమనస్సు నొందితే ఇంకా సమయమున్నందున వారిని క్షమిస్తాను. ఈ భూమిలో మహత్కార్యము జరిగిస్తాను."

దయచేసి మీ కళ్ళు తెరవండి. చిలీ దేశములోనున్న సువార్త సంఘము ఎదుగుతోంది. "నా ప్రజలతో చెప్పు - వారు క్షమాపన అడిగితే నేను క్షమిస్తాను." తరువాత నేను ఇంకో దర్శనము చూశాను. ఈ దర్శనములో అగ్ని లోకములంతటినీ కమ్మి ఉండడము చూశాను. యేసు అడిగాడు, "చూశావా? భూమి మీద నువ్వు చూస్తున్న ఆ అగ్ని చిలీ దేశము మీదుగా పంపబడినది. ఎందుకంటే చిలీ క్రీస్తు కొరకైనది! దేవుడు చిలీని మారుస్తాడు!" అప్పుడు నేను చిలీ మీదుగా వచ్చుటకు బయలుదేరిన అగ్నిని చూశాను. అప్పుడు యేసు అన్నాడు, "నా తండ్రి కన్నులు చిలీ మీద నున్నాయి." ఆ అగ్ని చిలీ మీద పడినప్పుడు ఇతర దేశాలు దానిని చూచి దేవుడు ఇక్కడ క్రియ జరిగిస్తున్నాడని గమనిస్తారు. చిలీలో దేవుని క్రియను చూచి భూమియందున్న సంఘమంతా హర్షించింది.

ఈ దర్శనములో దేవుడు నన్ను "పసియొ హుమడ" అనే ప్రదేశానికి తీసుకెళ్ళి, అవిటివారిని, వికలాంగులను చూపించాడు. అప్పుడు నేను చూడగా నిజమైన విశ్వాసులు కాళ్ళులేని వికలాంగులను గూర్చి ప్రార్థించి కాళ్ళు పెరగాలని ప్రార్థించారు. ఆ అవయవాలు లోబడి వాళ్ళు చూస్తుండగానే పెరిగాయి. చేతులు లేనివారికి వెంటనే నూతనమైన చేతులు ఉద్భవించాయి. ఈ కాలములో ప్రభువు ఆశ్చర్యకరమైన అద్భుతాలను చేస్తాడు. సంఘములలో ప్రజలు స్వస్థపరచబడుతారు. ఈ రోజుల్లో, చనిపోయిన వారు లేపబడుతారు. దేవుడు మిమ్ములను చిలీలో ఉపయోగించి పూర్వమందు అపొస్తలులు చేసిన అద్భుతములే మీ ద్వారా చేయిస్తాడు.

*దేవుడు నాకు(రికార్డో సిద్) దయచేసిన సంపూర్ణ బయలుపాటు ఇదే. ఆయన త్వరగా వచ్చుచున్నాడు. మరన్అత! ఆమేన్!*

